జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 9-4-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 305 పేజీలు: 4 వెల: రూ.7



## ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్..
# లింక్ తెగింది

* కంప్లి విరిగిపోవడంతో సుమ్మాదేవి వద్ద రెండుగా విడిపోయిన రైలు * ముందుకువెళ్లిన రైలుఇంజన్‌తో ఎనిమిది బోగీలు * పట్టాలపై నిలిచిన మరో 15 బోగీలు * అప్రమత్తమైన గార్డు, డ్రైవర్ * హుటాహుటిన ఉన్నతాధికారులకు సమాచారం * ఇతర రైళ్లు ఆ మార్గంలో రాకుండా చర్యలు * తప్పిన పెను ప్రమాదం * ఆందోళనలో ప్రయాణికులు * మరమ్మతుల అనంతరం వెళ్లిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు * విచారణకు ఆదేశించిన రైల్వేశాఖ ఉన్నతాధికారులు

**పలాస/మందస, ఏప్రిల్ 8 (వార్త):** సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్లే ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మంగళవారం ఉదయం సుమారు 7.15 గంటలకు పలాసకు చేరింది. రెండు నిమిషాలు హాల్ట్ తర్వాత బయలుదేరింది. సుమ్మాదేవి లెవెల్‌క్రాస్ గేట్ వద్ద ఏ1 ఏసీ కోచ్ బోగీ ఐరన్ కంప్లీ విరిగిపోయింది. లింక్ తెగిపోవడంతో ముందు ఇంజిన్‌తో పాటు ఎనిమిది బోగీలు ముందుకువెళ్లిపోగా, రైలు పట్టాలపై 15 బోగీలు నిలిచిపోయాయి. రైలుకు ఉన్న ఇంజనుతో పాటు బోగీలు ముందుకు వెళ్లిపోతున్నట్లు గుర్తించిన గార్డు వెంటనే లోకోపైలెట్‌కు సమాచారం అందజేశారు. దీంతో అప్రమత్తమైన పైలెట్ రైలును నిలిపివేశాడు. అలాగే రైల్వే అధికారులకు ఈ విషయాన్ని తెలియజేశారు. వారు అప్రమత్తమై ఆ రూట్‌లో రైళ్ల రాకపోకలు జరగకుండా చర్యలు చేపట్టారు. పలాస రైల్వే డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవతిరావు, లైన్‌ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్పీఎఫ్ ఎస్ఐ మాల్యాద్రి, మందస స్టేషన్ సూపరింటెండెంట్ గంటా హరిగోపాల్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి ఉన్నతాధికారులకు వివరించారు. కాగా, పలాస రైల్వేస్టేషన్ దాటి పది నిమిషాల నుంచి బోగీల ద్వారా భారీ శబ్దాలు వచ్చినట్టు గుర్తించామని ప్రయాణికులు తెలిపారు. సున్నాదేవి రైలుట్రాక్‌పై ఫలక్‌నుమా రైలు 2 గంటలు, మందస రైల్వేస్టేషన్‌లో గంటపాటు నిలిచిపోయింది. కంప్లి విరిగిన తరువాత రైలు ఇంజనుతో పాటు వేరయిన బోగీలను మందసలో నిలిపేశారు. అనంతరం అదే రైలు ఇంజను సహాయంతో పట్టాలపై నిలిచిన బోగీలను మందస వరకూ తీసుకువెళ్లారు. అక్కడ ప్రమాదానికి కారణమైన ఏ-1 ఏసీ కోచ్ బోగీని వేరు చేశారు. అందులో ఉన్న 42 మంది ప్రయాణికులకు వేరువేరు బోగీల్లో సీట్లు సర్దుబాటు చేసి మందస నుంచి భువనేశ్వర్ వరకు తరలించారు. కాగా.. రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రమాదం జరిగిన తరువాత బరంపురం, ఇచ్ఛాపురం వెళ్తున్న ప్రయాణికులు కొంతమంది రైలుదిగి బస్సులు, ప్రైవేటు వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఫలక్‌నుమా రైలు కంప్లి విరిగిన నేపథ్యంలో పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం, బరంపురం, ఆమదాలవలస రైల్వేస్టేషన్‌ల్లో అనేక రైళ్లను నిలిపేశారు. ఈ రైలు మరమ్మతులు అనంతరం పలు రైళ్లు, గూడ్సులను పంపించారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం







## జిల్లా అభివృద్ధికి.. సహకరించండి.. అడ్డుకోవద్దు

* ఎయిర్ పోర్టు, పరిశ్రమల ఏర్పాటుకు సలహాలివ్వండి * గత ప్రభుత్వ వైఫల్యాలతోనే సమస్యలు * మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలపై నోరు మెదపని జడ్పీటీసీ, ఎంపీపీలు * సూపర్ సిక్స్ ఎక్కడంటు ప్రశ్నించిన ఎమ్మెల్సీ విక్రాంత్ * ఇచ్చి తీరుతామని స్పష్టం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు * జూన్ నాటికి వంశధార ప్రాజెక్ట్ పనులు పూర్తి * 22ఏ పరిష్కార బాధ్యతలకు తహశీల్దార్లదే * డీఎంహెచ్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలి * సీఎఫ్ఎంఎస్ నిధులు దుర్వినియోగంపై నిజనిర్ధారణ కమిటి వేయాలి * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * వాడివేడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త):** జిల్లా అభివృద్ధిలో నిర్లక్ష్యం ప్రదర్శించడమే కాకుండా గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు. గృహనిర్మాణాలకు సుడా అనుమతులు, భూముల సమస్యలు పరిష్కారానికి తహశీల్దార్, ఆర్డీవోలకు అధికారాలు తొల గింపు ఇలా అనేక సమస్యలను గత సర్కార్ సృష్టించి దిగి పోయిందని వాటిన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్ పర్శన్ పిరియా విజయ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడుతో పాటు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుం డ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాణ్ అహ్మద్ ఖాన్, జడ్పీ సిఇఓ శ్రీధర్ రాజాతో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసి సభ్యులు, ఎంపిపిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశా లపై సుదీర్ఘంగానే ప్రస్తావించారు. ఈ నేపధ్యంలో తరచుగా మంత్రి అచ్చెన్నాయుడు గత ప్రభుత్వ పాలనలో వైఫల్యాలపై పదేపదే ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించుకోవడానికి ఆటంకం ఏర్పడడంతో అనేక మార్పులు తీసుకువస్తున్నామన్నారు. పంచాయతీలకు కేంద్రం కేటాయించిన నిధులు సైతం సర్పంచ్‌లకు తెలియకుండా మాయమయ్యాయన్నారు. కూటమి సర్కార్ వచ్చిన తరువాత అధికారాలు పంచాయతీకే దక్కాయ న్నారు. రెవెన్యూ వివాదాలు రోజు రోజుకి తీవ్రతరమయ్యాయని చిన్నచిన్న సమస్యలు సైతం పరిష్కరించేందుకు తహశీల్దార్‌కు ఉన్న అధికారాలను రద్దు చేసి డీఆర్ఓ, జేసిలకు అప్ప గించడంతో రైతుల సమస్యలు పేరుకుపోయా యన్నారు. 22ఏ వంటి భూసమస్యలను పరిష్కరించేందుకు తహశీల్దార్, ఆర్డీవోలకే అధికారాలు కట్టబెడుతున్నామని కేబినెట్ సమా వేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనిపై ఉత్తర్వులు వచ్చాయన్నారు. తహశీల్దార్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్క రించేందుకు చొరవ తీసుకోవాలని జేసికి మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. గత ప్రభుత్వ వైఫల్యాలని మంత్రి పదేపది సార్లు అన్న వైసీపీ జడ్పీటీసీ,ఎంపీపీలు పట్టించుకోలేదు కాని ఎంఎల్సీ విక్రాంత్ మాత్రం సూపర్ సిక్స్ పథ కాలు ఎక్కడని ప్రశ్నించారు. గత ప్రభుత్వ వైఫ ల్యాలపై ప్రస్తావిస్తునే సూపర్ సిక్స్ ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని మంత్రి అన్నారు. పాఠ శాలలు తెరిచేనాటికి విద్యార్థుల తల్లి ఖాతాలో డబ్బులు జమచేస్తామన్నారు. మత్స్యకారులను ఆదుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సాయంతో కలిపి రైతు లకు అండగా నిలుస్తామంటు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రోటోకాల్ పాటించడం లేదని సభ్యులు అనగా, గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ పాటించారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా ఉన్నామని పోర్టు పేరు మార్చాలంటే తమకు పెద్ద సమస్యకాదని అయినా అభివృద్ధి జరగాలనేదే తమ ఆకాంక్ష అన్నారు. తమకు ఎవరిపై కక్ష సాధింపు ఉండదని అభివృద్ధే అవస రమన్నారు. ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి మాట్లాడుతు తన మండలంలో పంచాయ తీరాజ్ పరిధిలో జరుగుతున్న పనులలో అవినీతి చోటుచేసుకుందని సభ దృష్టికి తీసుకురాగా ఎక్కడనేది స్పష్టంగా చెబితే దర్యాప్తు చేయిస్తామని మంత్రి తో పాటు జడ్పీ చైర్ పర్సన్ విజయ అన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యలపై ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు ప్రశ్నల వర్షం కురిపిం చారు. దీనిపై అధికారులు సమాధానం ఇవ్వడానికి నీళ్లు నమలగా వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. గతంలో జలజీవన్ మిషన్ పథకంలో పేరు లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించడం జరిగిందన్నారు. వైద్యసేవలపై పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావుతో పాటు రణస్థలం, సంత బొమ్మాళి జడ్పీటీసీలు ప్రశ్నించారు. కేన్సర్‌పై అవగాహన కల్పించాలని టెక్కలి జడ్పీటీసీ దువ్వాడ వాణి సభలో కోరారు. జిల్లా వైద్యారోగ్య శాఖ పూర్తిగా భ్రష్టు పట్టిందని చెడ్డపేరు వస్తున్నందున ఆ కార్యాలయంలోనే సమీక్షకు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కు మంత్రి సూచించారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య సమావేశంలో వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. నరసన్నపేట నియోజకవర్గంలో సీఎఫ్ ఎంఎస్ నిధులు దుర్వినియోగంపై ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి సభ దృష్టికి తీసుకురాగా నిజనిర్ధాన కమిటి వేసి దర్యాప్తు చేయించేందుకు నిర్ణయించారు. ఎంతో ప్రతిష్ఠాత్మ కంగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో అవినీతి పెచ్చుమీరుతుందని పనిని బట్టి వేతనం చెల్లించకుండా నిదులు దుర్వినియోగం చేస్తున్నారని ఎచ్చెర్ల, రణస్థలంమండలంతో పాటు మరికొందరు సభ్యులు, నరసన్నపేట,పాతపట్నం శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావులు సభ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో మాదిరిగా జిల్లా అభివృద్ధి కోసం వచ్చిన నిధులు ప్రసాదం పంచినట్టుగా పంచడం కుదరదని ప్రజల అవసరాలకు వాటిని వినియోగించాలని మంత్రి స్పష్టం చేసారు. సమావేశంలో ఎమ్మెల్యే లు గొండు శంకర్, తూర్పు కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణం నాయుడులతో పాటు సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## నేడు జిల్లాకు హోం మంత్రి రాక

**శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త):** జిల్లాకు హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత బుధవారం రానున్నారు. గత నెలలో ఆమె పర్యటించాల్సి ఉండగా అప్పట్లో వాయిదా పడింది. ముందుగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో మూడు జిల్లాలకు సంబంధించిన పోలీసు అధికారులతో సమావేశంకానున్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలకు చెందిన ఎస్పీలు, డీఎస్పీలతో పాలన పరమైన అంశాలపై సమీక్షించనున్నారు. క్రైం, రౌడీషీటర్లు, తదితర అంశాలపై హోం మంత్రి సమీక్షిస్తారు. బుధవారం ఆమె విజయవాడ నుంచి విశాఖపట్నం విమానంలో చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం గుండా శ్రీకాకుళం ఎస్పీ కార్యాలయానికి ఉదయం 11.30 గంటలకు చేరుకుంటారు. అధికారులతో మధ్యాహ్నం రెండు గంటల వరకు సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం జర్నలిస్టు ఆనంద్ సతీమణి లతశ్రీ గత కొన్నాళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నందున వారి ఇంటికి వెళ్లి పరామర్శించనున్నారు. హోం శాఖ మంత్రి వి. అనిత మరో సారి తన మానవత్వాన్ని చాటుకోనున్నారు. సీనియర్ జర్నలిస్టు అయిన కాశీమహంతిఆనంద్ కృష్ణకుమార్ సతీమణి లతశ్రీ చాలా ఏళ్లుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతుంది. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను దగ్గర నుండి చూడాలనే ఆమె కోరుకుంది. ఈ సమాచారం ఆమె వద్దకు కొందరు జర్నలిస్టు మిత్రులు తీసుకెళ్లడంతో ఆనంద్‌ను ఇదివరకే ఆమె ఫోన్ చేశారు. అనంతరం వాట్సప్ కాల్‌లో లతతో మాట్లాడారు. ఇటీవల తరచూ టీవీల్లో రాష్ట్ర హోం మంత్రి అనితను చూడడం, అసెంబ్లీ సమావేశాల్లోనూ, పలు సభలు సమావేశాల్లో మంత్రి మాట్లాడిన తీరును గమనించిన లతశ్రీ ఆమెను చూడాలని భర్తతో చెప్పడంతో ఆనంద్ కొంతమంది మీడియా మిత్రుల ద్వారా ఆ సమాచారాన్ని మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లారు. లతశ్రీతో ఇదివరకే మంత్రి అనిత వీడియో కాల్‌లో మాట్లాడి ధైర్యంగా ఉండాలని దానికి మించిన మెడిసన్ లేదని చెప్పారు. త్వరలోనే శ్రీకాకుళం వచ్చి, మిమ్మల్ని కలుస్తానని మాటిచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్నందున బలగ సమీపంలో గల ఆనంద్ ఇంటికి వెళ్లి లతశ్రీ పరామర్శించనున్నారు. కాగా ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం అందలేదు. గత ప్రభుత్వంలో కూడ అనేక పర్యాయాలు ప్రభుత్వానికి తన గోడును వెల్లగక్కారు. కూటమి సర్కార్ వచ్చిన తరువాత వైద్యం కోసం అవుతున్న ఖర్చు ఇతర ఆర్థిక సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించారు. అయినా ఎటువంటి సాయం అందలేదు. హోం శాఖ మంత్రి బుధవారం వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఏదోరకంగా ఆనంద్ కుటుంబాన్ని ఆదుకుంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## పొట్టి శ్రీరాములు మార్కెట్ పునర్నిర్మాణానికి ఒప్పుకోం

*వ్యాపారుల ఆగ్రహానికి గురికావద్దు *వ్యాపారులకి అండగా వైసీపీ *మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి




**శ్రీకాకుళం, ఏప్రిల్ 8 (వార్త):** పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ పునర్నిర్మాణాలు చేపట్టాలనే ఆలోచనను తాము ఒప్పుకోబోమని మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ఎంవీ పద్మావతి అన్నారు. మంగళవారం పలు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ వ్యాపారాలన్నీ సజావుగా సాగుతున్న తరుణంలో దాన్ని కూల్చివేసి పునర్నిర్మాణ పనులు చేపట్టి వర్తకుల ఆగ్రహానికి కూటమి నేతలు గురికావద్దని హితవు పలికారు. అవసరమైతే మార్కెట్లో అదనంగా నిర్మాణాలు చేపట్టి వ్యాపారులకి కేటాయించాలని, దాన్ని వదిలేసి ఉన్నదాన్ని కూల్చి మళ్ళీ కొత్తగా కట్టేందుకు సిద్ధపడటం సరికాదని పేర్కొన్నారు. ఉన్నపళంగా మార్కెట్‌ను కూల్చివేస్తే వ్యాపారులకి అన్యాయం జరుగుతుందని గుర్తు చేశారు. తాను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్నపుడు అప్పటి రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌ను నిర్మించినట్లు చెప్పారు. సువిశాలమైన రోడ్లతో వ్యాపారులకు అన్ని సౌకర్యాలతో మార్కెట్ వారికి అందుబాటులో తీసుకు వచ్చామన్నారు. కోవిడ్‌లోనూ మార్కెట్ లోపల, చుట్టుప్రక్క ఉన్న రోడ్లు అభివృద్ధి చేశామని వివరిం చారు. వ్యాపారాలు చేసుకుంటున్న సమయంలో పునర్నిర్మాణం పేరుతో కూల్చివేసేందుకు చర్యలు చేపట్టడం ఆశ్చర్యమని, వ్యాపారస్తులతో సమావేశం సైతం నిర్వహించకుండా, వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా తొలగింపు పనులు చేపట్టేందుకు అధికారులు సన్నద్ధం కావడం ఏమిటని ప్రశ్నించారు. వర్తకులతో చర్చించి, అభిప్రాయాలను తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వ్యాపారులకి ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని, కూటమి నేతలు, అధికారులు మార్కెట్ కూల్చి వేతపై పునరాలోచించుకోవాలని అన్నారు. లేకపోతే వ్యాపారుల పక్షాన పోరాటం చేసేందుకు తాము సిద్ధమని ఆమె స్పష్టం చేశారు.

## కొలిగాం పాఠశాలలో ఈగల్ క్లబ్ ఏర్పాటు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 8(వార్త):** ఎవరు కూడా మత్తు మందులకు బానిస కాకుండా తమ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొలిగాం ప్రధానోపాధ్యాయులు నరేంద్ర నాథ్ పట్నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ లు జ్యోతి, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.క్లబ్ సభ్యులుగా మారుతి బెహరా, అనుష నాయక్, కృష్ణ, ఆదిత్య, తపస్య, యశాస్విని, అమ్రితను నియమించారు.

# జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**-మంత్రులు శ్రీనివాస్, అచ్చెన్నాయుడు**

**-సమగ్ర సమీక్షలో పలు కీలక నిర్ణయాలు**



**శ్రీకాకుళం, ఏప్రిల్ 8(వార్త) :** జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన సహచర మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా నరేగా పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.500 కోట్ల మెటీరియల్ కాంపోనేంట్ పనులు చేపట్టాలని ఆదేశించారు. గత సంవత్సరాల పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. భూగర్భజలాల పెంపునకు చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు, పల్లె పుష్కరణిలు, ఫిష్ డ్రై ప్లాట్‌ఫాంలు, ఫామ్ పాండ్స్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 2014-19 మధ్య కాలంలో నిర్మించిన చెత్త నుంచి సంపద యూనిట్లను తిరిగి ఉపయోగంలోకి తేవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు మద్దతుగా వ్యవసాయ సంబంధిత పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. రహదారుల అభివృద్ధిపై సమీక్షిస్తూ, జిల్లాలో గుంతలేని రోడ్ల పనులు ఇప్పటికే 96 శాతం పూర్తయ్యాయని, వేసవి ముగిసేలోపు మిగిలిన పనులన్నీ పూర్తి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. అందాలవలస%-%శ్రీకాకుళం రోడ్డు విస్తరణ పనుల్లో శ్రీకాకుళం టౌన్ లిమిట్స్‌లో అస్థి నష్టం జరిగే వారికీ రూ.7 కోట్లు నష్టపరిహారం మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పెద్దపాడు రోడ్డు విస్తరణలో భాగంగా కొత్త విద్యుత్ స్తంభాల కోసం రూ.35 లక్షలు కలెక్టర్ నిధుల నుంచి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాగోలులో జేమ్స్ ఆసుపత్రి ఎదుట రూ.2.92 కోట్లతో సైనిక్ భవన్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన జరగనున్నట్లు వెల్లడించారు. కేఆర్ స్టేడియం పనుల పురోగతిపై సమీక్షించాలని, కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాకకు వీలుగా అనుకూలమైన ముహూర్తాలు వెంటనే సిద్ధం చేయాలని సూచించారు. వంశధార టెయిలెండ్ కి ఈ ఏడాది కూడా నీరు ఇచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని, షట్టర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలని ఆదేశించారు. సీఐడీ కేసు ప్రస్తుత స్థితిపై ఆరా తీశారు. బిఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు పనుల ప్రస్తుత పరిస్థితులను, నేరడి బ్యారేజీ నిర్మాణంలో ఒడిస్సా తో వస్తున్న అడ్డంకులపై మంత్రులు సుదీర్ఘంగా సమీక్ష చేశారు. పర్యాటక అభివృద్ధిపై మాట్లాడుతూ, జిల్లాలో టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని మంత్రులు ఆదేశించారు. ముఖ్యంగా తీరప్రాంత బీచ్‌లను పర్యాటక ఆకర్షణగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యా, వైద్య ఆరోగ్య, సర్వశిక్షా అభియాన్, బీసీ సంక్షేమం వంటి అంశాలపై సమీక్ష కొనసాగింది. కిడ్నీ సంబంధిత మరణాలపై పత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు సూచించారు. అంతకుముందు, ప్రతి నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. టెక్కలిలో ఇందుకోసం 20 ఎకరాలు సిద్ధం చేయాలని మంత్రి శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాగే, నరసన్నపేట నియోజకవర్గంలోని జమ్ములో 35 ఎకరాల భూమిని ఇప్పటికే గుర్తించామని చెప్పారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల అభిప్రాయాల మేరకు స్థల సమీకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రస్తుత స్థితిని మంత్రులకు వివరించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్, రహదారులు భవనాలు శాఖ ఇతర ముఖ్యమైన శాఖల పురోగతిని గణాంకాలతో సహా తెలియజేశారు. పెండింగ్ పనులను పూర్తి చేయడానికి తీసుకుంటున్న చర్యలను, కొత్తగా చేపట్టాల్సిన పనుల ప్రణాళికలను ఆయన మంత్రులకు నివేదించారు. పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను విద్యా, వైద్య ఆరోగ్య శాఖలలో మరింత మెరుగుదల కోసం చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, మామిడి గోవిందరావు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మే 10న జాతీయ లోక్ అదాలత్

**-జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జూనైద్ అహ్మద్ మౌలానా**



**శ్రీకాకుళం, ఏప్రిల్ 8(వార్త) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాబోయే మే 10న జిల్లా స్థాయిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జూనైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ, న్యాయపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, లోక్ అదాలత్ ద్వారా శాంతియుతంగా, పరస్పర అంగీకారంతో తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని సూచించారు.

జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడుతో కలిసి ఆయన మంగళవారం సమీక్షించారు. ప్రజల సహకారం ద్వారా మరిన్ని కేసులు రాజీదారిత్వంతో పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లోక్ అదాలత్‌లు న్యాయ వ్యయాలను తగ్గించి, వేగవంతమైన న్యాయం అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ఆయన వివరించారు.

## గిరిజనులకు కనీస మౌలిక వసతులు కల్పించండి




**సరుబుజ్జిలి, ఏప్రిల్ 8(వార్త) :** ఆమదాలవలస నియోజకవర్గం సరుబుజ్జిలి మండల కేంద్రంలో గిరిజన సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఈ రోజు సరుబుజ్జిలి మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న గిరిజన సంఘం నాయకులుతో కలిసి ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాజు. గోపాల్ మరియు గిరిజన నాయకులు మాట్లాడుతూ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జరిపిన సమగ్ర సర్వేలో గిరిజన గ్రామాల్లో అనేక సమస్యలు వెలుగు చూశాయి. అనేక గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు లేవు. గిరిజనుల భూములకు రక్షణ కరువైంది. అనేక గ్రామాలలో సామాజిక భవనాలు గాని, అంగన్వాడీ కేంద్రాలు గాని లేవు. సాగునీరు, త్రాగునీరు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. భూ ఆక్రమణలు అధికంగా ఉన్నాయి. గిరిజనుల భూములు గిరిజనేతరులు ఆక్రమిస్తూ, అడ్డుకున్న గిరిజనులపై దాడి చేస్తున్నారు. పోలీసులు కూడా తిరిగి గిరిజనుల పైనే కేసులు పెడుతున్నారు.ఐటీడీఏ లేక గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని లేకుంటే గిరిజనులు అందరూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.అలాగే గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కి వినతి పత్రాన్ని జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న మరియు గిరిజన నాయకులు సవర సింహాచలం,సవరజయరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర దర్మారావు, , దొర, సింహాచలం క్రిష్ణ మండలం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



## కాలనీలను పరిశీలించిన ఎమ్మెల్యే

**శ్రీకాకుళం, ఏప్రిల్ 8(వార్త) :** శ్రీకాకుళం పట్టణంలోని విశాఖ బి కాలనీ, ఈ కాలనీ, గోవింద్ నగర్ శ్రీనివాస నగర్ మహాలక్ష్మి నగర్, సాయి లక్ష్మీ నగర్, ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా లేదని, గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నామని శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ తెలిపారు. మంగళవారం పలు కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ కాలనీలో సిసి రోడ్లు డ్రైనేజ్ నిర్మాణాలు చేపడతామని త్వరలో ఆ పనులు ప్రారంభించి, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. పట్టణంలో మంచి ప్రాంతాలని ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వంపై ఉందని త్వరలో పనులు ప్రారంభించే విధంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హెల్త్ ఆఫీసర్ స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిలాస్‌పూర్‌లో అలరించిన నాట్య ప్రదర్శన



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 8(వార్త):** శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బిలాస్‌పూర్ అన్నపూర్ణ తెలుగు సమాజం ఆధ్వర్యంలో ఈనెల 6 ,7 తేదీలలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చెందిన చిన్నారుల కూచిపూడి భరతనాట్యం జానపద గీతాలు సంబల్పూరి నృత్యాలతో అందరినీ మంత్రముగ్ధులను చేశారు. అకాడమీ అధ్యక్షులు చిన్నా గురు స్వామి జయలక్ష్మి దంపతుల నాట్య గురువు శృతి పట్నాయక్ ఆధ్వర్యంలో నాట్య గురువులు సైలు జయలక్ష్మి శ్వేతా రాణి జాగృతి చిన్నారులు లిఖిత జైత్రీకాధ్యాయని రమ్యశ్రీ పల్లవి శ్రీ దీక్షిత సంజన ప్రణవి నిహారిక స్రవంతి జెస్సికా పాల్గొన్నారు మహాగణపతి సీతారామ చరితం గోవిందాశ్రిత భద్ర శైల రాజమందిర అదివో అల్లదివో వెంకటాచల నిలయం భావములోని ఐగిరి నందిని ముద్దుగారే పుడితే పుట్టాలి బృందావనికి డోలు బాజే జైపూర్ లో జై పులో పలుపాటలకు చిన్నారులు చక్కటి ప్రదర్శన చేసి ఆహుతులను అలరించారు ఈ కార్యక్రమంలో బిలాస్పూర్ బిజెపి ఎమ్మెల్యే అమర్ అగర్వాల్, నగర మేయర్ పూజ బిల్హా,బిజెపి ఎమ్మెల్యే ధర్మలాల్ కౌశిక్ మరియు పూజ కమిటీ పాల్గొని చిన్న గురుస్వామి దంపతులకు చిన్నారులకు సత్కరించారు .ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వాహన ధ్రువీకరణ పత్రాలు సమర్పించండి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 8(వార్త) :** ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలలో భాగంగా సీజ్ చేసిన వాహనాలను తీసుకెళ్లేందుకు వాహనదారులు సరైన వాహన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం పత్రికా ప్రకటన చేశారు.

## 22 వరకు పోషణ పక్వాడా

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 8(వార్త):** ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల 260 అంగన్వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీ లకు పెరుగుదల పర్యవేక్షణ మరియూ 2 సంత్సరాలు కంటే తక్కువ వయస్సు వున్న పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించడంమైనది. ఈ నెల 8 నుంచి 22 వరకు15 రోజులు రోజు వారి నిర్దేశిత కార్యక్రమలను అన్ని అంగన్వాడీ కేంద్రాలను నిర్వహిస్తారు.పోషణపక్వాడ కార్యక్రమం లో భాగంగా (పోషణ ట్రేకర్ ) యొక్క లబ్దిదారులను పరిచయం చేయటం. ప్రసవా నంతరం కేవలం మొదట ఆ రునెలలు తల్లిపాలను ప్రోత్సహించడం. గర్భవతులకు మరియూ కిశోరి బాలికలకు రక్త హీనత అవగాహన కార్యక్రమం నిర్వహించడం. మొదటి 1000 రోజులు పోషకహార ప్రాముఖ్యతను గర్భవతులు, బాలింతలు మరియూ సంరక్షకుల తో సమావేశాలు నిర్వహించును. మొదలగునవి చేయటమైనది. సమావేశంలో ప్రజా ప్రతినిధులు, ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగరాణి , సూపర్వైజర్‌లు సుజాత, నీలవేణి, లక్ష్మి, పల్లవి, పుష్పలత, . కృష్ణవేణి, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఈదుపురం పూజల్లో చైర్‌పర్సన్



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 8(వార్త):** ఈదుపురం రామ మందిర పునః ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా పూజల్లో మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అన్నా క్యాంటీన్ పరిశీలించిన కమిషనర్

**పలాస, ఏప్రిల్ 8(వార్త) :** కాశీబుగ్గ పాత బస్టాండ్ వద్దన్న అన్న క్యాంటీన్ ను పరిశీలించిన పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేనా రామారావు తనిఖీ చేశారు. రోజువారి పర్యటనలో భాగంగా  పలు వార్డులలో పర్యటించిన కమిషనరర్. పలాస కాశీబుగ్గ  పురపాలక సంఘంలో రోజువారి శానిటేషన్ పరిశీలనలో భాగంగా ఈరోజు మున్సిపల్ కమిషనర్ మంగళవారం పర్యటించి కాశీబుగ్గ 18 వ వార్డు తిలక్ నగర్లో రోడ్డు స్వీపింగ్ ప్రక్రియను పరిశీలించి, పలాస 26 వార్డు చేపల మార్కెట్లో చెత్తను క్లియర్ చేయించడం జరిగింది.  31 వ వార్డు పలాస వాసుదేవపేట లో చెత్తను క్లియర్ చేయించారు. 13వ వార్డు ఓల్డ్ బస్టాండ్ లో గార్బేజ్ ను క్లియర్ చేయించారు.  15వ వార్డు నెహ్రూ నగర్ లో డోర్ టు డోర్ కలెక్షన్ను సక్రమంగా జరిగేటట్లు ఆదేశాలిచ్చారు.  పలాస 24వ వార్డు ముత్యాలమ్మ కోనేరు ఎదురుగా గల మేజర్ డ్రైన్ లో బాబ్ కార్ట్ తో పూడికలు తీయించారు.తదనంతరం కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ రోడ్ లో గల అన్న క్యాంటీన ను రోజువారి తనిఖీల్లో భాగంగా, మంగళవారం కూడా తనిఖీ చేసి,  బెనిఫిషియర్స్ కు ఇచ్చిన బ్రేక్ ఫాస్ట్ మెనూ లో  క్వాలిటి-క్వాంటిటీ చెక్ చేసి, ప్రభుత్వ నిబంధనల మేరకు సరఫరా చేయవలసినదిగా నిర్వాహకులను కమిషనర్ ఆదేశించారు.

## స్వచ్ఛందంగా వదులుకున్నా



**పలాస, ఏప్రిల్ 8(వార్త):** సూదికొండపై గ్రావెల్ తవ్వకాలను స్వచ్ఛందంగా తప్పుకున్నానని 18 వ వార్డు కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ వెల్లడించారు. మంగళవా రం నిర్వహించిన  కౌన్సిల్ మావేశంలో అయ్యా చైర్మన్, మున్సిపల్ కమీషనర్ కి మనవి చేసుకుంటూ గత 5 ఏళ్లుగా సూదికొండపై ఉన్న కొండమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గంనకు కుడి-ఎడమ వైపున ఉన్న కొండ ప్రాంతం రోడ్డు కోసం అని చెప్పి రాత్రి పగలు అని చూడకుండా, ప్రభుత్వ అనుమతులు లేకుండా కంకర తవ్వి కొట్లాది రూపాయలు ప్రభుత్వ ధనం అక్రమంగా దోచుకొన్న ఆ ముష్టి దొంగను పట్టుకోవాలని తహసీల్దార్, మైనింగ్ డిపార్ట్మెంట్ వారు కలసి కంకర రూపంలో దోచుకొన్న సుమారు కోటి రూపాయలు డబ్బును ఆ ముష్టి దొంగ నుండి తిరిగి కట్టించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఆనాడు గ్రావెల్ తవ్విన స్థలంలో కొండకు దిగువ ఉన్న భూమిని అక్రమంగా పేదలకు కొట్లాది రూపాయలకు అమ్మి  డబ్బును దోచుకొన్న ఆ వెదవ పై చర్యలు తీసుకొవాలి అని తమరికి కోరుకుంటున్నాను. ఏంతో ప్రతిష్ట కలిగిన కేంద్రియ విద్యాలయం రాకను స్వాగతించాలి అనే ఉద్దేశ్యంతో నాకు పూర్తిగా ప్రభుత్వ అనుమతులు ఉన్న లీజ్ క్వారీని  నేను నా స్వంత ఆలోచనతో సరెండర్ చేయడం జరిగిందని వెల్లడించారు. ఆ కేంద్రియ విద్యాలయం కోసం కృషి చేసిన కింజరాపు రామ్మోహన్ నాయుడుకి, గౌతు శిరీషకి ధన్యవాదములు తెలుపుతున్నారు. మన పట్టణ ప్రజలు కొండకు అనించి ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూమిలో మొక్కలు నాటి కబ్జా చేసిన ఆ అక్రమదారుడు నుండి కాపాడి కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకు తన విధులను ఎవరికి తలవంచకుండా నిర్వహించిన తహసీల్దార్ కి,  ఇతర శాఖల అధికారులకు ఈ సమావేశం ద్వారా ధన్యవాదములు తెలుపుకుంటున్నాను. ప్రస్తుతం ప్రభుత్వ అధికారులు ఆదేశాలతో ప్రభుత్వ ఎమ్ఐ జి లేఔట్ కోసం గ్రావెల్ తీస్తున్నారని తెలుసుకోవాలన్నారు. దానిపై ఉన్న అనుమానాలకు త్రోవ లేకుండా నివృత్తి చేసి  వివరణ ఇవ్వాలని కోరారు.

## కన్నులపండువగా ఆదిత్యుడి కల్యాణం



**శ్రీకాకుళం, ఏప్రిల్ 8(వార్త) :** చైత్రశుద్ధ ఏకాదశి మంగళవారం రాత్రి 7 గంటలకు సూర్యనారాయణస్వామి స్వామివారికి వెండి అశ్వవాహనములపై  తిరు వీధి జరిపారు. అనంతరం రాత్రి 8-30 గంటలకు స్వామి వారికి ఉషాపద్మినీ చ్ఛాయాదేవీలతో కళ్యాణ మహోత్సవము, అగ్ని ప్రతిష్టాపనము, ప్రవేశ హోమాదులు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ పాల్గొన్నారు.



# మహిళలకు మరింత ఆదాయం

**-స్వయంసహాయ సంఘాల కోసం సమగ్ర ప్రణాళికలు**

**-జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**శ్రీకాకుళం, ఏప్రిల్ 8(వార్త) :** జిల్లాలోని స్వయంసహాయ మహిళా సంఘాలకు అధిక ఆదాయ అవకాశాలు కల్పించేందుకు వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇతర సంబంధిత ప్రభుత్వ విభాగాలు సమగ్ర ప్రతిపాదనలు ఇవ్వాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్థిరతకు దోహదపడే విధంగా ఆయా శాఖల పరిధిలో ఉపాధి యూనిట్ల స్థాపనకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.స్వయంసహాయ సంఘాల మహిళలు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఉపాధి యూనిట్లు ప్రారంభించేందుకు అనుకూల రంగాలను గుర్తించాలని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనిధి ఉన్నతి పథకాలు, నాబార్డ్ ప్రాజెక్టుల గురించి మంత్రి సమీక్షించారు. వాటిని జిల్లాలో అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.వ్యవసాయ అనుబంధ రంగాలు, లాభదాయక పంటల సాగు, సేవారంగాలు, ఉత్పత్తి రంగాల్లో యూనిట్ల ఏర్పాటుతో మహిళలకు అధిక ఆదాయ అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. మహిళలు ఉత్పత్తులు చేసేందుకు అవకాశాలు ఉన్న రంగాల్లో ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా మార్కెట్ విస్తరణ కల్పించాలని, తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరేలా చేయాలని సూచించారు. అలాగే, ఆర్థిక నిర్వహణపై 100 శాతం శిక్షణ (%ఋఝుజూఖుఎౌఎ దీబఅశ్రీఎఅఅస్త్ర శీఅ ఖీఅఖుఅఎఋశ్రీ ూంజూవ్మో%) ఇవ్వాలని, మహిళలు లావాదేవీల నిర్వహణలో స్వయం సమర్థత సాధించాలన్నదే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆర్థిక సంబంధిత కార్యకలాపాలపై విజిలెన్స్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. డిఆర్‌డిఎలో పనిచేసే ఏపిఎంలు తమ పరిధిలోని స్వయంసహాయ సంఘాల ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపరచేందుకు ఇది గొప్ప అవకాశం అని మంత్రి అభిప్రాయపడ్డారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్‌కు, నాబార్డ్ ప్రాజెక్టుల ఆధారంగా జిల్లాకు అనువైన ప్రణాళికలు రూపొందించి సమర్పించాలని సూచించారు. డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్ కుమార్ ప్రస్తుతం అమలులో ఉన్న జీవనోపాధి కార్యక్రమాలపై వివరాలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మహిళల ఆదాయాన్ని పెంచి, పేదరికం నుంచి బయటకు తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, సీడాప్ మేనేజర్ రమణ, చింతాడ రామ్మోహన్ రావు, డిపిఎం మోహనరావు, ఎచ్చర్ల ఏసి రవికుమార్, నరసన్నపేట ఏసీ కొండల రావు, ఆయా మండల ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

**పోషణ పఖ్వాడా పోస్టర్ ఆవిష్కరణ**

:జిల్లాలో పిల్లలకు నాణ్యమైన పోషణ, ప్రాథమిక విద్యను అందించేందుకు పోషణ పఖ్వాడా కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన హబ్ అంగన్‌వాడీ కేంద్రాల కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పోషణ పఖ్వాడా పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఐసిడీఎస్ పీడీ శాంతి శ్రీ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "చిన్నారుల ఆరోగ్యాన్ని, ఆహారపు స్థితిని మెరుగుపరచడం ద్వారా రాబోయే తరం పటిష్ఠంగా పెరగాలి. పోషణ పఖ్వాడా వంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచడంలో కీలకంగా ఉంటాయి" అని అన్నారు. జిల్లాలో 131 అంగన్‌వాడీ కేంద్రాలను హబ్ మోడల్ కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ కేంద్రాల్లో మెరుగైన మౌలిక వసతులు, పోషకాహారంతో కూడిన భోజనాల సరఫరా, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.



**ఎజెండాను చదవకుండా..**

## అడ్డుకునే అధికారం లేదు

**- చైర్మన్ వర్సెస్ కౌన్సిలర్ - అత్యవసర సమావేశం పక్కదారి**



**పలాస, ఏప్రిల్ 8(వార్త) :** పలాస మున్సిపాలిటీ అత్యవసర సమావేశాన్ని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ముందుగా ఏజెండాను చాదవి వినిపించడం ఆనవాయితగా వస్తుంది. ఎజెండా కొనసాగుతూ సమయంలో కౌన్సిలర్ దుర్గా శంకర్ పండా అడుతగులుతూ ఏ జెండాలో లేని  విషయాలు ప్రస్తావించగా చైర్మన్ ఘాటుగా స్పందిస్తూ తనకున్న విస్తృత అధికారంతో గౌరవ సభ్యుణ్ణి సమదించడానికి ప్రయత్నించగా ఆ కౌన్సిలర్ చైర్మన్ తో వాగ్వాదానికి దిగాడు. తనకున్న విస్తృత అధికారంతో బయట పంపించేందుకు వెనకాడ లేదని, చెప్పి కమిషనర్‌కు వివరణ నివ్వాలని తనకున్న విస్తృత అధికారంతో ఆదేశించారు. దీనిపై కౌన్సిలర్ దువా శ్రీకాంత్ కలగజేసుకొని చైర్మన్ కొన్నా విస్తృత అధికారంతో సమాచారంలేకుండా సమావేశం రద్దు చేసే అవకాశం ఉందని, ఎజెండను చదివిన తర్వాత మనకున్న సమస్యలు చర్చించుకోవాలని సర్ది చెప్పారు. ఎజెండామొత్తం చదివిన తర్వాత ఆయా అంశాలపై విస్తృతంగా చర్చించారు. 19వ వార్డు కౌన్సిలర్ బృందావతీ మాట్లాడుతూ గ్రావెల్ అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నయని, దీనిపై కౌన్సిల్ తీర్మానం ఉందా అంటూ ప్రశ్నించారు. ఇంతలో కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ కలగజేసుకుని ఘాటుగా సమాధానం చెప్పారు. ఉద్దానం ప్రాజెక్టు సంబంధించి మున్సిపాలిటీకి వచ్చే త్రాగునీరు కోసం నిధులు ఎంత వెచ్చించారని కౌన్సిలర్ దుర్గా శంకర్ పండ ప్రశ్నించడంతో అధికారులు కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది అన్నారు. తూతూ మంత్రంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ నడిపేనా రామారావు, డిఈ కనకరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు, కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ,తంగుడు ఆశాలత, సనపల సింహాచలం, అజయ్ కుమార్, బల్లా రేవతి, కో ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్, శ్రీను పాల్గొన్నారు.

## కార్యకర్తలే టీడీపీకి బలం : విభూది



**శ్రీకాకుళం, ఏప్రిల్ 8(వార్త) :** కార్యకర్తలే టీడీపీకు బలమని, 31 డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ విభూది సూరిబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం డివిజన్ పరిధిలో పట్నాయక్ కాలనీ, సాయినగర్, దండి వీదులకు సంబందించి పార్టీలో చేరిన వారికి మంగళగిరి నుంచి వచ్చిన పార్టీ సభ్యత్వ కార్డులను డివిజన్ ఇన్చార్జ సూరిబాబు చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎప్పుడూ అధికారంలో ఉన్నప్పుడు కూడా కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అలాగే కార్యకర్తలు కూడా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూనే ప్రజల అవసరాలను కూడా నెరవేర్చాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. తెలుగుదేశంపార్టీ బడుగుబలహీనవర్గాల పార్టీ అని, అందుకే సంక్షేమ పథకాలను ఆనాడు దివంగత నేత ఎన్‌టీఆర్ ప్రారంబించారని, అప్పటి నుంచి ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతునే ఉన్నాయని, అందులో ముఖ్యంగా సామాజిక ఫించన్‌తో పాటు మరికొన్ని పథకాలు ఉన్నాయి అని చెప్పారు.పార్టీ కార్యకర్తల కోసం రాష్ట్ర మంత్రి లోకేశ్‌బాబు ఎంతగానో ఆలోచన చేశారని, వారి యోగక్షేమం కోసం పార్టీ సభ్యత్వ కార్డు బీమా సదుపాయాన్ని కూడా కల్పించినట్లు చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతొందని, ఇప్పుడు శ్రీకాకుళం జిల్లా కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, అందుకు ముగ్గురు వ్యక్తులు కీలకంగామారారని, కేంద్ర,రాష్ట్ర మంత్రులు రామ్మోహననాయుడు,అచ్చెన్నాయుడు,  స్థానిక ఎమ్మెల్యే శంకర్లు ఉండడం వలన జిల్లా కేంద్రం కూడా అభివృద్ధి జరగడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రధాన విజయరాం, శంకరరావు, సుజాత,జయలక్ష్మీ పాల్గొన్నారు.

## గ్రావెల్ తవ్వకాలు నిలిపివేయాలి

**పలాస, ఏప్రిల్ 8(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు,సూదికొండ పరిధిలో ప్రజా ఆమోదం లేకుండా కౌన్సిల్ తీర్మానం లేకుండా కలెక్టర్  ఏకపక్ష అనుమతితో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలు తక్షణమే నిలుపుదల చేయాలని 19వ వార్డ్ కౌన్సిలర్ షిష్టు బృందావతి గోపి  మంగళవారం జరిగిన అత్యవసర మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేస్తూ చైర్మన్ బల్ల.గిరిబాబుకి వినతిపత్రం ఇచ్చారు. 19వ వార్డు కౌన్సిలర్ శిష్టు.బృందావతిగోపి గతలో సూదికొండలో గ్రావెల్ తవ్వకాలు జరిగినపుడు గ్రావెల్ తవ్వకాలను స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని, అప్పుడు కౌన్సిల్ తీర్మానం చేసి జిల్లా కలెక్టర్ వారికి కౌన్సిల్ ఆమోదం పంపించి గ్రావెల్ తవ్వకాలను పూర్తిగా నిలుపుదళ చేయడం జరిగింది. కానీ నేడు స్థానిక ప్రజలను కనీసం సంప్రదించకుండా మునిసిపల్ కౌన్సిల్ సమాచారం లేకుండా పట్టణం నడిఒడ్డున ఉన్న సూదికొండలో గ్రావెల్ తవ్వకాలు చేయడం అన్యాయంని, సూదికొండలో గ్రావెల్ తవ్వకాలు వలన పర్యావరణం దెబ్బ తిని జంట పట్టణాల్లో భూగర్భజలాలు అడుగంటుతాయని,  స్థానిక ప్రజలు భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కనుక ప్రజాభీష్టం మేరకు గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేయాలని కోరుకుంటున్నట్లు కౌన్సిలర్ శిష్టు బృందా వతి గోపీ డిమాండ్ చేశారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar ,  printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar,  E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546